సంపుటి - 7 అక్టోబర్ - 2023 సంచిక - 02

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం........................................................3

ప్రకృతి ..........................................................................6

తండ్రి వీరిని క్షమింపుడు ...............................................8

పవిత్ర కావలి సన్మనస్కులు .........................................10

బైబిల్ దర్శనం..............................................................12

శుభవచనం బైబిల్ క్విజ్...............................................15

ఇంద్రధనుస్సు.................................................................17


ఏంజెల్స్ కార్నర్.............................................................18

యువ స్పందన ..............................................................19

బైబిల్ దృశ్యమాలిక......................................................21


శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు................................23








**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**

**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో | ఫాదర్ ఎబిన్

Mr. M. సత్యం | సిస్టర్ క్రిస్టీన CMC

Mrs. K. శ్రీలత | Mr. J. లూర్థు స్వామి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల - 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**

**Cell: 09398764408**

**Email ID - jeevaswarammagazineadb@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**ప్రభూ! నేను నిన్ను శరణు వేడుచున్నాను.**
**శత్రువుల నుండి నన్ను కాపాడుము.**
**నీవు నా దేవుడవు.**
**కనుక నీ చిత్తమును పాటించు విధానము**
**నాకు ఎరిగింపుము. నీ మంచి ఆత్మము నన్ను**
**సరళ మార్గమున నడిపించును గాక!**
**(కీర్తన 143,9-10)**

జూలై నెల
శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు

మొదటి బహుమతి
ఎ. లక్ష్మి, డొంగ్రగాన్
రెండవ బహుమతి
డి. సువార్త, రాంపూర్
మూడవ బహుమతి
జి. లీలావతి, అనుకోడ

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

జూలై నెల
ఇంద్రధనుస్సు విజేతలు

మొదటి బహుమతి
డి. సంజన, ఖానపూర్
రెండవ బహుమతి
జాన్సన్, బెల్లంపల్లి
మూడవ బహుమతి
జి. దీవెన, గోదిరిగూడ

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి



## తండ్రి గారి సందేశం....

# క్షమాపణ

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

క్రైస్తవ్యానికి కేంద్ర స్థానమైన అంశమేదైనా ఉంటే, అది క్షమాపణ. దేవుడు తన సొంత కుమారుని ఈ లోకమునకు మన మధ్య జీవించడానికి, సరియైన మార్గాన్ని మనకు బోధించుటకు మనం అనుభవించే శోధనలు, బాధలు అనుభవించుటకు పంపాడు. మరియు మనం రక్షింపబడడానికిగాను కల్వరి సిలువలో ఘోరమైన, కఠోరమైన మరణాన్ని అనుభవింపజేశాడు. "క్రీస్తు పాపరహితుడు. కాని దేవుడు మన నిమిత్తమై ఆయనను పాపముగ చేసెను. ఏలయన ఆయనతో ఏకమగుటవలన, మనము దేవుని నీతిగ రూపొందవలెనని అట్లు చేసెను. (2 కొరంతీ 5,21). పాపులను క్షమించడానికి యేసు ప్రభు తన సిలువ బలి ద్వారా మూల్యం చెల్లించాడు. ఆయన మరణం మనకు క్షమాపణను తెచ్చింది.

దేవుని కుమారుని మరణం కొరకు కేకలు వేసిన ఆ జనులే పేతురు ప్రసంగం విని, తీవ్రమైన ఆవేదనతో, "సహోదరులారా! మేము ఏమి చేయవలెను?" (అపోస్తుల కార్యములు 2,37) అని పేతురును, అపోస్తలులను అడుగగా, అందుకు పేతురు గారు "మీరు హృదయ పరివర్తన చెంది మీ పాప పరిహారమునకై ప్రతి ఒక్కడు యేసు క్రీస్తు నామమున, బప్తిస్మము పొందవలయును. అప్పుడు మీరు దేవుని వరమగు పవిత్రాత్మను పొందుదురు. (అపోస్తుల కార్యములు 2,38) అని అన్నాడు. దీని ద్వారా ఎంత ఘోరపాపినైన దేవుడు క్షమించడానికి సిద్ధంగా ఉన్నాడు అని మనకు అర్థమవుతుంది.

**క్షమించబడినవాడు క్షమించాలి**

మనం దేవునికి విరోధంగా పాపం చేసినప్పుడు ఆయన మనలను ఎలా క్షమించాడో మన యెడల అపరాధములను చేసిన వారిని మనం కూడా అలాగే క్షమించాలని యేసు ప్రభు నేర్పించాడు. పరలోక ప్రార్థనలో ప్రభువైన యేసు క్రీస్తు ఈ విషయాన్ని సూచించాడు. "మా యొద్ద అప్పుపడిన వారిని మేము క్షమించినట్లు, మా అప్పులను క్షమించండి" (మత్తయి 6,12). అదే విధంగా "పరులు చేసిన తప్పులను మీరు క్షమింపని ఎడల మీ తండ్రి మీ తప్పులను క్షమింపడు (మత్తయి 6, 15) అని బోధించాడు. అంతేగాక, "పరస్పరము దయను, మృదుత్వమును ప్రదర్శింపుడు. క్రీస్తు ద్వారా దేవుడు మిమ్ము క్షమించినట్లే ఒకరిని ఒకరు క్షమింపుడు" (ఎఫెసీ 4,32) అని పరిశుద్ధ గ్రంథం మనకు క్షమాపణ గురించి నేర్పిస్తుంది.

ఒకనాడు పేతురు గారు యేసు ప్రభువును "ప్రభూ! నా సహోదరుడు నాకు ద్రోహము చేయుచుండ నేనెన్ని పర్యాయములు అతనిని క్షమింపవలెను? ఏడు పర్యాయములా?" అని అడిగాడు. దానికి జవాబుగా యేసు ప్రభు "ఏడు కాదు ఏడు డెబ్బది పర్యాయములు' అని సమాధానమిచ్చాడు. (మత్తయి 18,21-22) క్షమాపణను గూర్చి బైబిల్లో చెప్పబడిన గొప్ప ఉపమానములలో ఒక దానిని ఈ సందర్భంగా ప్రభువు చెప్పాడు. తాను ఎన్నడూ చెల్లించలేనంత ఋణాన్ని సేవకులలో ఒకడు ఋణపడి ఉండినప్పటికీ రాజు అతనిని ఉచితంగానే క్షమించాడు, అతని అప్పును రద్దు చేసాడు. కానీ కేవలం కొద్ది వరహాలే ఋణపడి ఉన్న

తన తోటి సేవకున్ని ఆ సేవకుడు క్షమించ లేకపోయాడు. తోటి సేవకుని పట్ల అమానుషంగా ప్రవర్తించిన ఆ సేవకుని యెడల రాజు ఏలాంటి వైఖరిని అనుసరించాడో క్షమించని వారి యెడల దేవుడు అదే వైఖరిని అనుసరిస్తాడని యేసు ప్రభు తెలియజేశాడు. "అపుడు యజమానుడు వానిని పిలిపించి 'నీచుడా! నీవు నన్ను ప్రార్థించుటచే నీ ఋణమంతయు క్షమించితిని. నేను నీ పట్ల దయచూపినట్లే నీవు నీ తోటి సేవకునిపై దయచూపవలదా?' అని, మండిపడి బాకీ నంతయు చెల్లించు వరకు వానిని తలారులకు అప్పగించెను. కనుక ఈ విధముగా మీలో ఒక్కొక్కడు తన సోదరుని హృదయ పూర్వకముగా క్షమింపని యెడల పరలోకమందలి నా తండ్రియు మీ యెడల అట్లే ప్రవర్తించును" (మత్తయి 18,32-35).

పాపక్షమాపణ విషయంలో దేవుడు ఏ విధమైన హద్దులను నియమించలేదనేది దీనివలన అర్థమవుతుంది. ఎంతటి ఘోరమైన నేరాలైనా దోషాలైనా క్షమించబడతాయి. ప్రభువు ఇలా అన్నాడు. "నీ సోదరుడు తప్పిదము చేసిన యెడల అతనిని మందలింపుము. అతడు పశ్చాత్తాపపడిన యెడల అతనిని క్షమింపుము. అతడు రోజునకు ఏడు పర్యాయములు నీ పట్ల తప్పిదము చేసి, ఏడుమార్లు 'నీ వద్దకు వచ్చి నేనే పశ్చాత్తాపపడుచున్నాను' అని నీతో చెప్పిన యెడల వానిని క్షమింపుము" అని చెప్పెను (లూకా 17,3-4). ఈ ప్రతిపాదన ఎంత బలమైనదో ఆలోచించండి. ఒక సహోదరుని పాపమును గూర్చి మనం ఎరిగినప్పుడు, మనం అతన్ని గద్దించాలి. అతడు మారుమనస్సు పొందినప్పుడు, మనం అతన్ని క్షమించాలి. అతడు మరలా అదే తప్పు చేసినా మనం క్షమించవలసి ఉంటుంది.

**క్షమాపణ మార్పును తెస్తుంది**

"దేవుని ఎదుట మన పాపములను ఒప్పుకొనినచో, ఆయన మన పాపములను క్షమించి, మన అవినీతి నుండి మనలను శుద్ధిచేసి, నీతిని చేకూర్చును. కనుక ఆయన విశ్వసనీయుడు, నీతిమంతుడు" (1 యోహాను 1,9). పాపము మన ఆత్మను కళంకపరుస్తుంది. పాపములు క్షమించబడినప్పుడు మనం శుద్ధీకరించబడతాం. "మీరు హృదయ పరివర్తన చెంది, దేవుని వైపు మరలిన యెడల, ఆయన మీ పాపములను తుడిచి వేయును" (అపోస్తుల కార్యములు 3,19). దేవుడు పాపమును క్షమించినప్పుడు, పాపాలు తుడిచివేయబడుతాయి.

క్షమాపణ జీవితంలో నెమ్మదినిస్తుంది. పగను హృదయంలో ఉంచుకోవటం కన్నా మానసిక, ఉద్వేగ, ఆత్మ సంబంధమైన ఆరోగ్యాన్ని ఎక్కువగా పాడుచేసేది మరేది ఉండదు. క్షమించుటకు మనం నిరాకరించినప్పుడు, జీవితం విషాదకరంగాను, బాధాకరంగాను మారుతుంది, ఏదో ఒక విధంగా మనలను పరాభవం చేసిన ప్రతివానిపై మనం కోపగించుకొంటూ ఉంటాం."అతడు క్షమింపబడతగినవాడు కాదు" లేదా "తన్ను క్షమించుమని ఆమె ఎన్నడు నన్ను అడుగలేదు" అని మనం కొన్ని సార్లు అంటుంటాము. ప్రభువునందు దేవుడు మనలను క్షమించినట్లు మనం ఇతరులను క్షమించాలి. యేసు సిలువలో వ్రేలాడుతూ "తండ్రీ వీరు చేయునదేమో వీరు ఎరుగరు. వీరిని క్షమింపుము" అని పలికాడు (లూకా 23,34). క్రీస్తు వారిని క్షమించుటకు సిద్ధపడ్డాడు. మన చుట్టూ ఉన్న వారిని మనం క్షమించినప్పుడు, మాత్సర్యము, పగ అనేవాటి నుండి మనం స్వతంత్రులమై ఉంటాం.

కాబట్టి ప్రియ సహోదరీ సహోదరులారా, అందరిని ప్రేమిస్తూ క్షమిస్తూ ముందుకు సాగుదాం. అదే క్రీస్తు మనల నుండి కోరుకునేది. దేవుడు మనలందరిని దీవించును గాక! ఆమెన్.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# ప్రకృతి

1. "ఇది మేము పూర్వమే చెప్పియుంటిమి. మరల చెప్పుచున్నాము. మీరు స్వీకరించిన సువార్త కంటె వేరైన మరియొక సువార్త మీకు ఎవడేని బోధించినచో అతడు శాపగ్రస్తుడగును గాక! నేను ఇపుడు మానవుల ఆమోదమును పొందుటకు ప్రయత్నించుచున్నానా? లేక దేవుని ఆమోదమునా? లేక నేను మానవులను సంతోషపెట్టుటకు ప్రయత్నించుచున్నానా? నేను ఇంకను మానవులను సంతోషపెట్టుటకే ప్రయత్నించుచున్నచో నేను క్రీస్తు సేవకుడనై ఉండను" (గలతీ 1,10-11).

2. "ఆయన మూలమున దేవుడు సమస్తమును సృజించెను. ఆయన లేకుండ సృష్టిలో ఏదియు చేయబడలేదు" (యోహాను 1,3).

3. "జీవించు ప్రతిప్రాణి ప్రాణము, ప్రతి నరుని ఊపిరి, ఆయన ఆధీనములో ఉన్నది" (యోబు 12,10).

4. "ప్రభువు విజయము చేయుటకు గాంచి ఆకాశము ఆనందించును గాక! భూమి హర్షించును గాక! సాగరమును, దానిలోని ప్రాణులును హోరుమని నినదించును గాక! పొలములును వానిలోని పైరులును సంతసించును గాక! అరణ్యములలోని వృక్షములు ఆనంద నాదము చేయును గాక!" (కీర్తన 96,11-12)

5. "భూగర్భము మొదలుకొని పర్వత శిఖరముల వరకు అన్నిటిని ఆయనే పరిపాలించును. సముద్రము ఆయనది, ఆయనే దానిని చేసెను. ధరణి ఆయనది, ఆయనే దానిని కలిగించెను" (కీర్తన 95,4-5)

6. "ఆకాశము దేవుని మహిమను చాటుచున్నది. అంతరిక్షము ప్రభువు సృష్టిని వెల్లడి చేయుచున్నది" (కీర్తన 19,1).

7. "దేవుడు ప్రపంచమును సృష్టించిన నాటి నుండి ఆయన యొక్క అగోచర గుణములు అనగా ఆయన శాశ్వత శక్తి దైవత్వము, సృష్టి వస్తుజాలములో స్పష్టముగ విశదమైనవి కనుక వారికి ఎట్టి సాకును లేదు"

(రోమీ 1,20).

8. "భూమిని చేసినది, దాని మీద నరుని సృజించినది నేనే. నా శక్తితో నేను ఆకాశమును విశాలముగా విప్పితిని. నేను సూర్య, చంద్ర, తారకలను నా ఆధీనమున ఉంచుకొందును" (యెషయా 45,12).

9. "ప్రభూ! ఓ దేవా! మహిమ, గౌరవము, శక్తి పొందుటకు నీవు అర్హుడవు. ఏలన, సర్వమునకు నీవే సృష్టికర్తవు నీ సంకల్పముననే అవి జీవమును పొంది బ్రతుకుచున్నవి" (దర్శన గ్రంథము 4,11).

10. "నీవు పశువుల కొరకు గడ్డిని మొలిపింతువు. నరుని ఉపయోగము కొరకు మొక్కలు మొలిపింతువు. అతడు నేల నుండి పంటలు పండించును"

(కీర్తన 104,14)

11. "లిల్లీ పుష్పములు ఎట్లు పెరుగుచున్నవో చూడుడు. అవి తమకై శ్రమపడుట లేదు, వస్త్రములు నేయుటలేదు. అయినను సకల వైభవములతో కూడిన సొలోమోను సైతము వాని సౌందర్యమును పొందలేదని మీతో చెప్పుచున్నాను" (లూకా 12,27).

12. "మీరు వస్త్రములకై తహతహ పడనేల? లిల్లీ పుష్పములు పెరుగు రీతిని పరికింపుడు. అవి తమకై శ్రమ పడుట లేదు. వస్త్రములను సంసిద్ధపరచుకొనుట లేదుగదా! సకల వైభవసమేతుడగు సొలేమోను సైతము లిల్లీపుష్ప సౌందర్యము నందలేదు"


(మత్తయి 6,28-29).

13. "నీ చేతి పనితనముతో కలిగించిన ఆకాశమును, నీవు సృజించిన చంద్రతారకలను కాంచి నేను విస్మయమైందితిని. నీవు నరుని జ్ఞప్తికి తెచ్చుకొనుటకు అతడేపాటి వాడు? అల్పమానవుని పరామర్శించుటకు అతడు ఎంతటివాడు" (కీర్తన 8,3-4)

14. "కాని సముద్రము నీటితో నిండియుండునట్లే, భూమి ప్రభువు కీర్తిని గూర్చిన జ్ఞానముతో నిండియుండును" (హబక్కూకు 2,14). 7

**"దేవా! నాలో నిర్మల హృదయమును సృజింపుము. నూతనమును స్థిరమునైన మనస్సును నాలో నెలకొల్పుము"**

**(కీర్తన 51,10)**




# తండ్రీ! వీరిని క్షమించు (మొదటి మాట)

(గత సంచిక తరువాయి భాగం)

ఎందుకంటే యేసు ప్రభును శిక్షిస్తున్నవారు క్షమించమని అడగడం లేదు. ఈయన వారిని క్షమించమని తండ్రిని అడుగుతున్నారు. దేవుడు క్షమిస్తాడా, లేదా అనేది తరువాత విషయం ఆ క్షణం కూడ ఆయన అంగీకోసం చీట్లు వేసుకునే వారు, ఆయనను అపహసించేవారు, జోక్స్ వేసేవారు, బల్లంతో పొడిచేవారు, కొరడాతో కొట్టిన వాళ్ళు అందరికి కూడ ఆ సిలువలోనే క్షమ దొరుకుతుంది. ఒకవేళ వాళ్ళకు తెలిసి ఉంటే వాస్తవంగా వాళ్ళకు తెలియదు. "అవతలి వారికి తెలియదు" అని మనకు ఎలా తెలస్తుందంటే మనం వారి స్థానంలో ఉండి ఆలోచించడం. ఎదుటి వారు తప్పు చేసినప్పుడు మన ప్రవర్తన చాల వేరుగా ఉంటుంది. ఎందుకంటే మనం అసలు తప్పు చేయమని, చాల నీతిమంతులమని అనుకుంటాము. యేసు ప్రభు అసలు, సిసలైన నీతిమంతుడై ఉండి వారి స్థానంలో ఉండి ఆయన ఆలోచిస్తున్నాడు. మొదటి మాటలో యేసుప్రభు తప్పు చేస్తునవారి పరిస్థితిని ఎంత బాగా అర్థం చేసుకుంటున్నారో గమనించండి. అదే మన ఇంటిలో మన పట్ల ఎవరైన తప్పు చేస్తే లేదా పక్కింటి వారు మన పట్ల తప్పు చేస్తే వాళ్ళ వైపు నుండి, వాళ్ళ స్థానంలో ఉండి మనమెప్పుడైనా ఆలోచించామా? ఒకవేళ మనం అలా వారి స్థానంలో వెళ్ళి ఆలోచిస్తే మనకు క్షమించే మనసు దొరకుతుంది. అలా చేసినట్లయితే ఎదుటి వారిని క్షమించే గుణాన్ని మనం పెంపొందిచుకో వచ్చును. మన జీవితంలో ఎన్ని

తపస్సుకాలలు గడిచి ఉంటాయి? అయినా మన పట్ల తప్పు చేసిన వారిని మనం క్షమించగలుగుతున్నామా? మహా పరిశుద్ధుడేమో పాపిని క్షమిస్తున్నాడు. పాపులైన మనం ఎదుటి పాపిని క్షమించలేకపోతున్నాం! క్షమించే హృదయాన్ని మనం పెంపొందించుకోవాలని ఈ మొదటి మాట మనల్ని హెచ్చరిస్తుంది. ఇంకొక కోణంలో ఈ మొదటి మాటను ధ్యానించినప్పుడు, మనకు తప్పు చేస్తున్న వారి కోసం ప్రార్థించే మనస్సు ఉండాలి. ఇక్కడ తప్పు చేస్తున్న వారు క్షమించిమని ప్రార్థించడం లేదు. కాని యేసుప్రభువే వారి పక్షాన తండ్రిని ప్రార్థిస్తున్నారు. నాలుగు సువార్తలలో మనం గమనించినట్టయితే యేసు ప్రభువు ఎప్పుడు మన పక్షాన ప్రార్థిస్తునే ఉన్నారు. ఎదుటి వారి కోసం మనం ప్రార్థించాలంటే మనం వారి స్థానంలోకి వెళ్ళాలి. ఉదాహరణకు ఒక ఆక్సిడెంట్ అయిన వ్యక్తి కోసం మనం ప్రార్థించాలంటే మనకే ఆక్సిడెంట్ అయిన ఫీలింగ్ మనకు ఉండాలి అప్పుడే మన ప్రార్థన గుండెల్లోతుల్లోనుంచి వస్తుంది. కొడుకుకు ఆక్సిడెంట్ అయితే తల్లి చేసే ప్రార్థనకు పక్కింటి ఆవిడ చేసే ప్రార్థనకు తేడా ఉంటుంది. యేసుప్రభువు సిలువలో మనం పడే బాధల యొక్క సహాను భావం అనుభవించారు కాబట్టి ఆయన మన పక్షాన ప్రార్థన చేయగలరు. ఇది మనం గ్రహించవలసిన సత్యం, మనమందరం కష్టాల గుండా వెళతాం. అయితే మనకొచ్చే ప్రతి బాధలో, ప్రతి వేదనలో ప్రతి కీడులో, ప్రాణాంతకమైన వ్యాధి వచ్చినప్పుడు కూడ మనం గుర్తించుకోవలసిన విషయం ఏమిటంటే యేసు ప్రభు మన పక్షాన అప్పటికే సిలువలో వాటిని అనుభవించాడు అని! అందుకే ఆయన మన పక్షాన తండ్రికి విజ్ఞాపన చేయగలరు. ఎదుటి వారి కోసం చేసే ప్రార్థన గుండెల్లోలోతు నుండి రావాలి. మన ఇంట్లో కష్టం వచ్చినప్పుడు మనం చేసే ప్రార్థనకు, పక్కింటి వారికి కష్టం వచ్చినప్పుడు మనం చేసే ప్రార్థనకు ఏమైన తేడా ఉందో లేదో మీరే గమనించండి! క్రైస్తవులమైన మనకు ప్రార్థించడం అనేది ఒక మంచి అలవాటు. పౌలు తన పత్రికలలో చాలసార్లు చెబుతారు “మీ కోసం నేను మానక ప్రార్థన చేస్తున్నాను” అని. ఎక్కడైతే ప్రేమించే మనసు ఉంటుందో అక్కడ ప్రార్థించే మనసు ఉంటుంది. ఈ మొదటి మాటలోని ఇంకొక కోణం ఏమిటంటే ఆయన ఎంతటి ఉన్నతమైన విలువలను బోధించారో ఆ విలువలను జీవితంలో ఆచరించి చూపించారు. ప్రపంచంలో ఎందరో గొప్ప ప్రబోధకులు వచ్చారు, పోయారు. అయితే ప్రబోధించిన విషయాన్ని, జీవితంలో ఆచరించి చూపించిన ప్రబోధకుడు కేవలం యేసు ప్రభు ఒక్కరే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. మత్తయి సువార్త 5వ. అధ్యాయం 44వ. వచనం మీరు చదివితే మీరు శత్రువులను ప్రేమించండి. మిమ్మల్ని హింసించే వారి గురించి, బాధించే వారి గురించి ప్రార్థించండి! ఈ మాట చెప్పినప్పుడు ఆయన సిలువపై లేదు. ఆయన సువార్త పరిచర్య ప్రారంభదశ అది. ఏదైతే ఆయన బోధించాడో, అలాగే సిలువపై జీవించి చూపించాడు. సాధారణంగా చట్టాలు చేసేవారు చట్టానికి లోబడరు. కాని ఈయన ఏదైతే మనకు ప్రమాణాన్ని చెప్పాడో అలాగే జీవించి చూపించాడు. అందుకే ఒక క్రైస్తవుడు ఏదైతే చెప్తాడో అలాగే జీవించి చూపించాలి. ఎందుకంటే యేసును మర్చిపోతే ఆయన బోధల్ని నెరవేర్చలేం. ఆయన బోధల్ని మర్చిపోతే యేసును వెంబడించలేం!

ఇంకొక ముఖ్యమైన విషయం "వీరేం చేయుచున్నారో వీరికి తెలియదు". అంటే ఈ లోకం ఇంకా వెలిగించబడలేదు. ఈ సమాజంలో ఊహించనటువంటి నేరాలు, ఘోరాలు జరగడానికి ప్రధాన కారణం ఇంకా వారు వెలిగించబడలేదు. కొరింతీ పత్రికలో చెప్పినట్లు ఈ యుగసంబంధమైన దేవత వారి మనోనేత్రములకు అంధత్వాన్ని కలుగ జేసింది. వాళ్ళ కళ్ళు మూసుకు పోయాయి. ఒకోసారి ఎంత చెప్పిన మన పిల్లలు అర్థం చేసుకోరు, ఎంత చెప్పినా ప్రక్కింటి వారు మనల్ని అపార్థం చేసుకుంటారు. ఎందుకంటే వారి కళ్ళు మూసుకు పోయాయి. అలాంటి వారిని చూసి జాలి పడాలి. వారి గురించి ప్రార్థించాలి. ఒక కళ్ళులేని కబోది రోడ్డుపై మనల్ని గుద్దుకున్నాడు అనుకోండి ముందు కోపంతో తిట్టినా కళ్ళు లేవని తెలిసి "అయ్యో! ఎందుకు తిట్టానా" అని బాధ పడతాం! అలాగే ఈ లోకాన్ని చూసి జాలిపడాలి. అప్పుడే సువార్తను బోధించగలుగుతాం! దేవుడు ఈ వాక్యాన్ని దీవించుగాక! ఆమెన్!

లూర్థుస్వామి,
బెల్లంపల్లి

**ఆగస్టు నెల**
**శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు**

మొదటి బహుమతి
**డి. దేవదాస్, భీమారం**
రెండవ బహుమతి
**జి. జెస్విన, ఆసిఫాబాద్**
మూడవ బహుమతి
**కె. ప్రణయ్, ఆదిలాబాద్**

**బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి**

**ఆగస్టు నెల**
**ఇంద్రధనుస్సు విజేతలు**

మొదటి బహుమతి
**కె. దీక్షిత, మంచిర్యాల**
రెండవ బహుమతి
**కె. జాన్సన్, ఇంద్రవెల్లి**
మూడవ బహుమతి
**డి. అమల, రాంపూర్**

**బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి**



## పవిత్ర కావలి సన్మనస్కులు

**(ఒక్కొక్క మనిషిని ఆత్మ శరీర ఆపదల నుండి కాపాడుతూ మంచి పనులనే చేయుటలో సాయపడే కావలి దేవదూతలను జ్ఞాపక పరచుకొనుట 16వ శతాబ్దము)**

ఈ భూమిని మనిషిని సృష్టింపక మునుపే భగవంతుడు లెక్కలేనన్ని ఆత్మల్ని కలిగించారు. వీరినే దూతలు లేక సన్మస్కులు అని బైబిలు పలుకుతుంది. ఈ జీవముగల శరీరములేని ఆత్మలకు స్వాభావికంగా చావులేదు. పరిశుద్ధమును సుఖమునైన స్థితిలో సృష్టింపబడిన ఆత్మలువారు. దేవుని యందు ఆనందించువారు. దేవుడు ఉన్నది మోక్షంలో, ఆ మోక్షమే వారికి బహుమానంగా ఇవ్వబడింది. స్వేచ్ఛా జీవులుగా దేవుని సదా సేవించుటయే వారి విధి. పిత, పుత్ర, పవిత్రాత్మ దేవునిలోని పుత్రుడు యేసు క్రీస్తుగా భూలోకంలో శరీరధారియై యున్నాగాని దైవ సమానుడు. దేవుడే కాన సదాస్తుతి మహిమ ఆరాధనలకు పాత్రుడే. ఈ విషయం దైవం సన్మనస్కులకు ముందుగా ఎరిగించారని నమ్ముతున్నాం. ఆ సందర్భంలోనే లూసిఫరు అనబడే ఆత్మ నాయకత్వంలో కొన్ని ఆత్మలు శరీరధారి రూపదేవుని కొలువ తిరస్కరించారు. తాముసు చావులేని శాశ్వత సుఖ జీవులని సౌందర్యములోను ఆనందములోను కొదువలేని వారలని, దేవుని విధేయించి సేవించుటయే విధిగా ఉండాల్సిన పనిలేదని తాము స్వేచ్ఛా జీవులమని గర్వముతో నాట్యమాడారు. అంతే దేవుని కోపాగ్నికి గురియై వారికి బహుమానంగా ఇవ్వబడిన మోక్షం నుండి గెంటివేయబడ్డారు. దేవుడు దయచేసిన స్వర్గపుణ్యాలైన పరిశుద్ధత (సౌందర్యము), సుఖము (ఆనందము) తొలగింపబడి దైవ శాపానికి గురికాగా ఆ దుష్టాత్మలు దేవునితో సమరానికి దిగారు. మిఖాయేలు దూత నాయకత్వంలో లూసిఫరు దాని అనుచర ఆత్మలు ఓడింపబడి మోక్షం నుండి కూల్చివేయబడ్డాయి. వారినే సైతానులు పిశాచములని పిలుస్తాం. వారి నివాసం కోసం దేవుడు నరకం అనే లోకాన్ని సృష్టించారు. (యెషయా 14,12-19; లూకా 10,18; 2పేతురు 11,4).

విధేయులైన ఆత్మల (దూతలు లేక సన్మనస్కుల)కు తనను సదా దర్శించుకొనే లేక చూడ కలిగే భాగ్యాన్ని వరాన్ని దేవుడు అనుగ్రహించారు. పవిత్ర గ్రంథం చెప్తున్న విషయం బట్టి సన్మనస్కులు తొమ్మిది బృందాలుగా లేక విభాగాలుగా ఉన్నారు. వీరిలో 'సెరాఫీము' సన్మనస్కుల విభాగం అత్యున్నతమైనది. పరలోకంలోని సన్మనస్కులే భూలోకంలోని మనుష్యులకు సంరక్షకులుగా ఉంటున్నారు. (మత్తయి 18,10) వారు తరచు దేవుని

ఆజ్ఞచే మోక్షం నుండి భూలోకానికి 'వార్తా హరులుగా' పంపబడుచున్నారు. అందుకే వారు ఏంజిల్స్ అనగా 'దూతలు' లేక 'దూవదూతల'ని పిలువబడుచున్నారు. వీరంతా రమారమి పది లక్షల మంది ఉండొచ్చని వేదపండితులన్నారు.

పవిత్ర కావలి సన్మనస్కుల పండుగ రోజున శ్రీసభ ఆద్యంతరహిత శాశ్వత సర్వేశ్వరుని మరియు భూలోకంలో దివ్యసత్ప్రసాద రూప దైవాన్ని అందిస్తూ సదా స్తుతి గానం చేసే అగణిత సన్మనస్కుల బృందాన్ని స్మరించి ప్రత్యేకంగా గౌరవిస్తుంది. మరియమాతను గౌరవింప పరివేష్ఠితమై, భూలోకంలోను, ఉత్తరించు స్థలంలోను ఉన్న ఆత్మలను సంరక్షిస్తూ సాయపడే ఆ సన్మనస్కుల్ని తన బిడ్డలచే జ్ఞాపకపరచుకుని సదా గౌరవించేలా చేయడానికి పవిత్ర శ్రీసభ ఈ పండుగను ఏర్పరచింది. హిప్పోనగర పునీత అగస్తీనుగారు "దీన యాత్రికులమైన మనపట్ల సన్మనస్కులు జాగ్రత్తగా చూస్తుంటారు. మనపై జాలి చూపుతుంటారు. దేవుని ఆజ్ఞ చొప్పున వేగిరమున మనకు సాయ మందిస్తుంటారు. మనకు ఇష్టమైన చోటకు ఎక్కడకు వెళ్లినా వారు మనకు తోడుగా ఉంటారు" అని పలుకుచున్నారు. ఇక పునీత జెరోముగారు "మానవుని ఆత్మ మిక్కిలి పరిశుద్ధంగా ఉండటం గౌరవ ప్రదమైనది. అందుకే అది జీవం పోసుకున్నది. మొదలు ఒక్కోమనిషికి కావలి సన్మనస్కుని దేవుడు ఏర్పరచారు" అంటున్నారు. అయితే పునీత బెర్నార్డుగారు "పరిశుద్ధ సన్మనస్కులను నీ స్నేహితులుగా చేసికో మనం ఎంత బలహీనంగా ఉన్నా, మన పరిస్థితి ఎంత విచారంగా ఉన్నా, ఎంత పెద్ద ఆపదలు చుట్టుముట్టి ఉన్నా ఈ కావలి సన్మనస్కుల సంరక్షణలో మనం ఏ మాత్రం భయపడనక్కరలేదు" అని వక్కాణిస్తున్నారు. కావలి సన్మనస్కులు మన ఆత్మ శరీరాల్ని అన్ని రకాలు అపాయాల నుండి కాపాడతారు. సైతాను శోధనలను జయింప ప్రేరణ ప్రోత్సాహ సహాయాలందించి ఆదుకుంటారు ముఖ్యంగా మరణావస్థలో. దేవుని సేవలో సదాలోచనలు, సత్క్రియలను చేయ ప్రేరేపిస్తారు. రాబోయే ఆత్మ కీడుల విషయమై హెచ్చరికలు చేస్తారు. మన మనవుల్ని దేవుని సింహాసనం ఎదుటకు గొనిపోతారు. మనల్ని తమ సొంతమైన వారిగా భావించి కలసిపోతారు. మరణానంతరం మన ఆత్మలను ఉత్తరించు స్థలం చేర్చ మార్గం చూపుతూ నడిపింప జేస్తారు. పాపాలన్నీ ప్రాయశ్చిత్తమై విశుద్ధ పరచబడిన పిమ్మట మన ఆత్మలను మోక్ష ద్వారం చెంతకు చేర్చుతారు. దేవుని తీర్పు సింహాసనం వద్దకు చేర్చేటంత మట్టుకే వారు తోడ్పడతారు.

కావలి సన్మనస్కులైనట్టి వారు ఎంతోమంది పునీతులకు ప్రత్యక్షమై వారితో సంభాషించడం జరిగింది. రోమునగర పునీత ఫ్రాన్సెసమ్మ గారు వారి మాటల్లో "దేవదూత ఆకారము కనబడురీతి ఎంతో మధురంగాను తేజస్సుతోను నిండి ఉంటుంది. గాజు వస్త్రం వలె ఉండు ఆ దేవదూత పరలోక పరిశుద్ధతను మాటల్లో వర్ణింపలేము. వారి ఒకే ఒక్క చూపు మన ఆత్మ ఉగ్రమైన భక్తి జ్వాలను రగిలింప జేస్తుంది" అని చెప్తున్నారు. పునీత బెర్నార్డు గారు విశ్వాసులకు ఇచ్చిన తమ ఉపదేశంలో ఇలా పేర్కొన్నారు. "నీ కావలి సన్మనస్కుని ఆదరించు నీ భద్రతపట్ల చూపిన జాగరూకతకు కృతజ్ఞత చూపించు. వారిపై నమ్మిక ఉంచు. ప్రేమించు. ప్రతి కష్టంలోను కీడులోను, శోధలోను వారివైపు మరలి వారి సంరక్షణ సహాయానికై ప్రార్థించు".

**ధ్యానాంశం :** ప్రభువు నిన్ను తన దూతల ఆధీనమున ఉంచును. నీవు ఎచటికి వెళ్లినను వారు నిన్ను కాపాడుచుందురు (కీర్తన 91,11)




(గత సంచిక తరువాయి భాగం)

### 6.8 బాలలకు దీవెనలు 10:13-16

పసిబిడ్డలను అడ్డగిస్తున్న శిష్యులపై కోపించిన యేసు ఆ పసిబిడ్డలను చేరదీసి, దీవించి అట్టివారిదే దేవుని రాజ్యం అని బోధించాడు. పసిబిడ్డల వలె దేవుని యందు అచంచలమైన విశ్వాసం నమ్మకం ఉంటే తప్ప ఎవరూ కూడా యేసు బోధిస్తున్న శిష్య లక్షణాలు కలిగి ఆయన్ని అనుసరించలేరు. పసిబిడ్డలు తమ అస్సహాయతను, అమాయకతను అంగీకరిస్తూ ఇతరుల సహాయమును స్వీకరిస్తారు. అలాగనే యేసును అనుసరింపగోరువారు తమ నిస్సహాయతను అంగీకరిస్తూ దేవుని సహాయమును స్వీకరించటానికి సిద్ధమవ్వాలి. అపుడే తమలో దేవుని శక్తి పొందగలరు. ఆ శక్తితో యేసు శిష్యులుగా జీవించగలరు.

### 6.9 ధనాపేక్ష - దేవరాజ్యం 10:17-31

యేసు యెరూషలేం పయనంలో జరిగిన సంఘటన ఇది. యువకుడు ధనికుడైనప్పటికీ మోషే ధర్మశాస్త్రంలో ఇచ్చిన ఆజ్ఞలను తు.చ. తప్పకుండా పాటించువాడు. అయినను తృప్తి చెందక నిత్యజీవ సంక్రమునకు, తన జీవితంలో పరిపూర్ణతను సాధించాలకున్నాడు. అందుకు యేసు అతని సంపదను పేదలకు దానం చేసి తనను వెంబడించమని కోరాడు. అధిక సంపద కలవాడగుటచే ఆ యువకుడు విచారంతో వెళ్ళిపోయాడు. అతని అధిక సంపదలు యేసు మాటను పాటించకుండా చేశాయి. పరిపూర్ణతను సాధించుటలో మనిషికి సంపదలు అడ్డుగా నిలుస్తాయి. అందువలననే సంపదలపైనే హృదయం కేంద్రీకరించిన ధనవంతులు

దేవుని రాజ్యంలో ప్రవేశించుట కష్టమని తెలిపాడు. తన శిష్యులు పరిపూర్ణత సాధించాలంటే తన మార్గంలో పయనించాలన్నారు. “మన యేసుక్రీస్తు ప్రభువు యొక్క కృప ఎట్టిదో మీరు ఎరుగుదురు కదా! తాను భాగ్యవంతుడై ఉండి కూడా తన పేదరికం వలన మిమ్ము భాగ్యవంతులను చేయుటకు ఆయన నిరుపేద అయ్యాడు” (2 కొరింతీ 8,9) అని పౌలు సూచించాడు. దైవరాజ్యపాలనకు, దైవచిత్తమునకు అవసరమైతే సంపదలను చివరకు ప్రాణమునైన త్యాగం చేయ సిద్ధపడాలి. సంపదలు అధికమైనపుడు హృదయములు సంపదలవైపే మొగ్గు చూపుతాయి. అపుడు పరలోక విషయములపై దృష్టి సారిచటం కష్టమవుతుంది. అందువలననే, యేసు “ధనవంతుడు దేవుని రాజ్యంలో ప్రవేశించటం కంటే ఒంటె సూది బెజ్జములో దూరిపోవట సులభతరం” అని అన్నాడు. ఇది అతిశయోక్తి అన్పించినను సంపదలు ఎక్కువైనపుడు హృదయం దేవునివైపు, పరలోకరాజ్యంవైపు మరలించుట కష్టమని తెలిపాడు. కాని దేవునికి అసాధ్యమైనదీ ఏదీ లేదు. ఎందువలనంటె అధికసంపదలు గలిగినవారు కూడా క్రీస్తు కోసం, సువార్త వ్యాప్తి కోసం వాటిని త్యజించి తమ జీవితాలను క్రీస్తుకు సమర్పించివారున్నారు. క్రీస్తు కోసం, సువార్త కోసం సంపదలను, కుటుంబ సభ్యులను కూడా త్యజించువాడు దానికి ప్రతిఫలం పొందుతాడు. అయితే కొన్నిసార్లు హింసలు కూడా అనుభవించాల్సి వస్తుంది. అయితే వారు శాశ్వతజీవన బహుమానం తప్పక పొందుతారు. ఈ త్యజింపు త్యాగం చేయాలన్నా కూడా దేవుని కృప అవసరం.

### 6.10 మూడవసారి శ్రమల మరణ పునరుత్థాన ప్రస్తావన 10:32-34)

మొదటి రెండు ప్రస్తావనల కంటె ఈ మూడవ ప్రస్తావనలో ఎక్కువ వివరాలున్నాయి. తన శ్రమల సంఘటనలు యెరూషలేంలో జరుగుతాయని, అన్యులు ఆయనపై ఉమ్మివేసి, కొరడాలతో మోది చంపుతారని వివరిస్తున్నాడు. యేసు యెరూషలేమునకు దగ్గరయ్యే కొలది తనను తాను యెషయా ప్రవచించిన బాధామయ సేవకునిగా తెలియజేశాడు (యెషయా 53,1-7). యెరూషలేములో తనకు జరుగబోవునది తెలిసికూడా యెరూషలేం వైపు సాగాడు. తమ వెనుకకు తగ్గలేదు. అందరికంటె ముందు నడుస్తున్నాడు. యేసు శ్రమలు మరణం దేవుని చిత్తం కావున మనస్ఫూర్తిగా స్వీకరించాడు. శిష్యులు కూడా ఆయన వెంట అలాగనే పయనించాలి.

### 6.11 యాకోబు, యోహానుల అధికార వ్యామోహం - యేసు సమాధానం 10:35-44,45

మొదటి రెండుసార్లు యేసు శ్రమల ప్రస్తావనలోని అంతరార్థమును గ్రహించుటలో శిష్యులు విఫలమయ్యారు. అందుకే యేసు తన శ్రమల, సిలువ మరణం మూడవసారి ప్రస్తావించిన తరువాత కూడా యాకోబు, యోహానులు యేసు రాజ్యంలో కుడి, ఎడమల స్థానములకై ప్రాకులాడుతున్నారు. అందుకు యేసు వారిని తన శ్రమల పాత్రను వారు త్రాగగలరా అని ప్రశ్నించాడు. దాని వలన యేసు వారికి సవాలును విసిరాడు. తన మహిమలో పాలు పంచుకోవాలంటే వారు తన శ్రమల పాత్రలో కూడా పాలు పంచుకోవాలన్నాడు.

తక్కిన పదుగురు యాకోబు, యోహానులపై కినుకవహించినపుడు, యేసు వారికి తనరాకలోని మర్మమును విడమరచి చెప్పాడు. తాను సేవించటానికే కాని, సేవింపబడటానికి రాలేదన్నాడు. అనేకుల రక్షణార్థము తన ప్రాణమును ధారపోయుటకు వచ్చానన్నాడు. కావున తన శిష్యులు కూడా లోకంలోని వ్యక్తులవలె అధికారం కోసం ప్రాకులాడక సేవకు తమ జీవితం అర్పించుకోవాలి. క్రైస్తవులలో నాయకత్వం సేవకేగాని, పెత్తనమునకు కాదు. ఇతరుల స్థానంలో మూల్యం చెల్లించడానికి యేసు క్రీస్తు మరణించినట్లే ఆయన శిష్యులు కూడా అవసరమైతే ఇతరుల స్థానంలో తమ ప్రాణమును ధారపోయుటకు సిద్ధమవ్వాలి, ఇవ్వాలి. ఇదే నిజమైన శిష్య లక్షణం.



## పునీత అస్సిస్సిపుర ఫ్రాన్సీస్ గారి ప్రార్థన

శాంతి సాధనగా, నీ నిత్యశాంతి సాధనగా నన్ను చేయుమో ప్రభో, నన్ను చేయుమో ప్రభో!
ద్వేషమున్న చోట ప్రేమను – పాపమున్న చోట క్షమాపణను,
అవిశ్వాసమున్న చోట ఆశను – చీకటి యున్న చోట కాంతిని,
దు:ఖమున్న చోట సంతోషమును చూపనిమ్ము – ప్రభూ! చూపనిమ్ము!
ఓ ప్రభువా! సానుభూతి కాశించక – సానుభూతి చూపనిమ్ము
పరులు నన్ను తెలియక కాదు – పరులు నాకు తెలియనిమ్ము
పరుల ప్రేమ కాశించక – పరులనెప్పుడు ప్రేమింపనిమ్ము
కృంగిపోవు మానవులకు – సహాయం చేయశక్తి నిమ్ము
అంధకార బంధితులకు – వెలుగు చూపనిమ్ము
దు:ఖదురిత జీవులకు – సుఖశాంతులు పంచనిమ్ము
పరుల పాప క్షమాపణలోనే – క్షమాభిక్ష పొందనిమ్ము
మరణమొందునపుడే – మోక్షం మనకు సంసిద్ధం

# శుభవచనం బైబిల్ క్విజ్

**లూకా సువార్త 13-21 అధ్యాయాలు**

పేరు ............................ఇంటి పేరు.........................విచారణ .............................

## I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

ఫోన్ నెంబర్.................................

1) అది ఒకడు తన తోటలో వేసిన ........................................................... పోలి ఉన్నది.

2) అక్కడ వారు ఎడతెగక .............................................................. దేవుని స్తుతించుచుండిరి.

3) నా నామము నిమిత్తము మిమ్ములను అందరు .........................................................

4) ఆయన ................................................................... ప్రతి దినము ఉపదేశించుచుండెను.

5) దేవుడు త్వరలోనే వారికి ................................................... చేకూర్చునని మీతో చెప్పుచున్నాను.

6) కడపటి వారు ............................ వారగుదురు. మొదటి వారు .............................. అగుదురు.

7) యేసు విశ్రాంతి దినమున ప్రార్థన మందిరము ................................ నందు ఉపదేశించుచుండెను.

8) అప్పుడు జలోదర రోగ పీడితుడు ఒకడు ....................................................... వద్దకు వచ్చెను.

9) అతడు పశ్చాత్తాప పడిన యెడల అతని .............................................................. .

10)............................................................... చోటనే రాబందులు చేరును అని యేసు చెప్పెను.

11) ఇల్లు కట్టువారు త్రోసి వేసిన రాయి ముఖ్యమయిన ................................................ అయ్యెను.

12) భూమ్యాకాశములు గతించిపోవును. కాని ............................................ ఎన్నటికిని గతించిపోవు.

13) మీ ...................................................................... కాలము ఆసన్నమైనది.

14) యేసు అచటకు వచ్చినపుడు పైకి చూచి, అతనితో ............................................ త్వరగా దిగిరమ్ము.

15) ఏ సేవకుడు ................................................................ యజమానులను సేవింప జాలడు.

16) నిన్ను ..................................................................... వచ్చిన కాలమున నీవు గుర్తింపలేదు.

17) ఆయన బోధలు వినుటకై ........................................ ప్రజలందరు ప్రాత:కాలముననే వెళ్లెడివారు.

18) యేసు వానితో నేడు నీవు నాతో కూడ ....................ఉందువు. అని మీతో నిజముగా చెప్పుచున్నాను అనెను.

19) యేసును చూచి ................................................................ మిక్కిలి సంతోషించెను

20) దేవాలయపు ............................................................................... నడిమికి చినిగెను.

21) నాకు ఇతనితో ................................................................... కన్పించుట లేదు అని పలికెను.

22) నీ ..................................................................... నిన్ను స్వస్థపరచినది అని యేసు పలికెను.

23) తన ............................................... ఎత్తుకొని నన్ను వెంబడింపని వాడు నాకు యోగ్యుడు కాడు.

24) తిరిగి వచ్చి ..................................................... స్తుతించువాడు ఈ అన్యుడు ఒక్కడేనా? అనెను.


25) ఆ గడియ వచ్చినపుడు యేసు శిష్యులతో ..................................................... కూర్చుండెను.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ అక్టోబర్ నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: యోహాను సువార్త 1-10 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

“నీవు పరిపూర్ణుడవు కాగోరిచనచో, వెళ్లి నీ ఆస్తిని అమ్మి, బీదలకు దానము చేయుము. అపుడు పరలోకమందు నీకు ధనము కలుగును. నీవు వచ్చి నన్ను అనుసరింపుము” (మత్తయి 19,21). **పునీత ఫ్రాన్సిస్ అస్సిస్సి** గారి చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:..................................వయస్సు........తరగతి........స్థలం....................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ అక్టోబర్ నెల 25 తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

దేవుని ప్రేమను మనము ఎలా అనుభవములోనికి తెచ్చుకొనగలము. దేవుడు ప్రేమ – ఆ ప్రేమను నేను అనుభవంలోకి తెచ్చుకోవాలంటే ముందుగా నేను దేవున్ని నా జీవిత అనుభవంలోకి తెచ్చుకోవాలి. అదెలా సాధ్యమవుతుదంటే...

**1. యేసును ముందుగా మన జీవితాల్లోకి ఆహ్వానించాలి.**

(దర్శన 3,20)లో చెప్పిన విధముగా తన కోరకు మన జీవిత తలుపులు తెరవమని యేసు అడుగుచున్నారు.

**2. పవిత్రాత్మకు మన జీవితాలను విప్పిపెట్టాలి.**

ఈ నిరీక్షణ మనకు నిరాశ కలిగింపదు. ఏలన దేవుడు మనకొసగిన పవిత్రాత్మ ద్వారా తన ప్రేమతో మన హృదయాలను నింపెను (రోమా 5,5)

ఒక ముఖ్య విషయం : దేవుని ప్రేమతో నింపబడాలని నీవు నిజముగా హృదయపూర్వకంగా కోరుకున్న యెడల, దేవునికి చెందని ప్రతిదానిని నీ హృదయములో నుంచి, జీవితమునుంచి, గృహములో నుంచి బయటకు త్రోసివేయాలి.

**ఈ పరమ సత్యాలను ధ్యానించుదాం:**

– మనలను చేసింది ప్రేమే! రక్షించింది ప్రేమే.

– మనిషిని చేసిన వేళ, దేవుని ప్రణాళిక ప్రేమే.

– దేవుని వైవిక స్వభావము ప్రేమే.

– దైవ ప్రేమ నుండి పుట్టిన మనం దేవుని ప్రేమించాలి.

– దేవుని ప్రేమించుటకే దేవుడు నరుని చేశాడు.

అయితే మనం మానవులందరిని ప్రేమించిన రోజున, దేవుని ప్రేమకు మనము పాత్రులవుతాము.



# సువార్త ప్రబోధము

తాను సృజించిన ప్రాణులను గూర్చి దేవుని మనస్సులో గొప్ప ప్రణాళిక, గొప్ప లక్ష్యాలున్నాయి (ఎఫెసీ 1,10). ఆ ప్రణాళికలో తాను ఎన్నుకొన్న ప్రజలు పాలి భాగస్వాములు అవ్వాలని దేవుని కోరిక. ఫారో దాస్యం నుంచి హెబ్రీయులను విడిపించుటలో మోషే; వారిని వాగ్దాన భూమికి నడిపించుటలో యెహోషువా; అలాగే యిస్రాయేలులను ప్రభు మార్గంలో నడుపు విషయములో ఎందరో ప్రవక్తలు, కడన యేసు క్రీస్తు మార్గమును సిద్ధపరచుటలో బప్తిస్మమిచ్చు యోహాను దేవుని ఎన్నిక మేరకు తమ వంతు సాయం అందించారు.

ఆ పిమ్మట తనతో ఉండుటకు సువార్త ప్రకటనకు పంపుట కొరకు యేసు 12 మంది అపోస్తలులను ఎన్నుకొని వారికి దయ్యములను పారద్రోలు అధికారమిచ్చారు (మార్కు 3,13-19). వారిని పిలిచి తగు శిక్షణనిచ్చి, వారితోపాటు అనేక మంది శిష్యులను సమీకరించి శ్రీసభను స్థాపించారు. వారే నూతన దైవ ప్రజ! తన తండ్రి తనకు ఇచ్చిన పనిని ముగించుకొని తండ్రి చెంతకు తిరిగి ఎక్కిపోయే వేళ యేసు ప్రభువు తన శిష్యులందరికి వీడ్కోలు సందేశంగా ఒక మహా ఆజ్ఞను ఇచ్చారు. “మీరు ప్రపంచ మందంతట తిరిగి సకల జాతి జనులకు సువార్తను బోధించుడు” (మార్కు 16,15). యేసును గూర్చి ఆయన రక్షణ కార్యములను గూర్చి (సువార్తమానము) ఇతరులతో పంచుకొనుటను “సువార్త ప్రబోధము” Evangelization అంటున్నాము.

1. సువార్తను ప్రకటించుటకు ఆవశ్యకమైన అంశము – యేసు క్రీస్తుకు సాక్షి అగుట.

పవిత్రాత్మచేత శక్తి సమన్వితులైననే తప్ప తన శిష్యులు సువార్త పిలుపుకు తగిన విధముగా స్పందించలేరని యేసుకు తెలియును. "అందుకే పవిత్రాత్మ మీపైకి వచ్చునపుడు మీరు శక్తిని పొందుదురు. కనుక మీరు యేరూషలేములో యూదయా సమరియా సీమలయందంతట, భూదిగంతయులవరకు నాకు సాక్షులై ఉండెదరు (అ.కా 1,8). అని పలికారు. యేసు చేసిన ఈ వాగ్దానం పెంతకోస్తునాడు నెరవేరింది (అ.కా 2,1). పవిత్రాత్మచేత అభిషేకము పొందిన ఈ సాక్షులు ధైర్యంగా లోకంలోకి వెళ్ళి యేసుని ప్రకటించారు. తమ విశ్వాసాన్ని ప్రదర్శించారు. యేసు చెప్పినవన్నీ బోధించారు. యేసు చేసినట్లు అద్భుతాలు సూచన క్రియలు చేశారు (మార్కు 16,20) ఫలితంగా విశ్వాసుల సంఖ్య పెరిగింది.

నేటి యువత తమ విశ్వాస జీవితంలో క్రీస్తుకు సాక్షులుగా మారాలి. కాబట్టి దేవున్ని నిజాయితిగా వెదకు ప్రతివారు – విశ్వాసులవుతారు, విశ్వాసులైనవారు క్రీస్తునకు శిష్యులవుతారు. క్రీస్తు శిష్యులే – సువార్తికులుగా పరిణతి చెందుతారు. నిజానికి శిష్యరికం – సువార్తా ప్రబోధం రెండూ కలిసి కొనసాగుతాయి. క్రీస్తునకు మంచి సాక్ష్యుని, సాక్ష్యురాలి వలె జీవించే ప్రయత్నం చేద్దాం!

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త


2022 బైబిల్ క్విజ్ సిరీస్‌ను మనం పూర్తి చేసుకున్నాము. ఇక ఫిబ్రవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభిస్తున్నాము.


1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.

2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ॥ 10,000/–లు, రెండవ బహుమతి రూ॥ 8,000/–లు, మూడవ బహుమతి రూ. 6,000/– సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**

# బైబిల్ దృశ్యమాలిక


అమోరీయుల పట్టణాలన్నిటినీ ఇశ్రాయేలీయులు స్వాధీనపరచుకున్నారు.
బిడ్డలారా, నాకాలం ఐపోవచ్చింది. వాగ్దత్త దేశంలో ప్రవేశించడానికి ప్రభువు నన్ను అనుమతించలేదు. ఇకమీదట జోషువా మిమ్ము అక్కడికి నడిపిస్తాడు
మరచిపోకండి వాగ్దత్త దేశాన్ని మీకు ఇచ్చేది యెహోవాయే. ఆయన ఒప్పందానికి కట్టుబడి ఉండండి.




నెబో పర్వతం మీద **మోషే** మృతి చెందాడు. వాగ్ధత్త దేశం కోసం పోరాటం కొనసాగుతూనే ఉంది

తదుపరి కథ: **జోషువా**

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

## లూకా సువార్త 1-13 అధ్యాయాలు

1). మనుష్యకుమారుడు (12,40)

2). పవిత్రాత్మ (12,12)

3). దేవుని రాజ్యమునకు (9,62)

4). ప్రాణమును (9,24)

5). యోహాను (1,60)

6). నలువది రోజులు (4,2)

7). దేవరాజ్యము (6,20)

8). పాపములు (7,47)

9). రోగులను స్వస్థపరచుటకు (9,2)

10). ప్రజలను (7,16)

11). రోగులను స్వస్థపరచి (10,9)

12). నీ పొరుగువానిని ప్రేమింపుడు (10,27)

13). మూడు (11,5)

14). చీకటిలో (12,3)

15). రాజ్యము (12,13)

16). ఆహారము, వస్త్రముల (12,23)

17). సువార్త (7,22)

18). సీమోను (5,3)

19). మార్గమును (3,4)

20). ఆత్మయును, శక్తియును (1,17)

21). కురేనియా, సిరియా (2,2)

22). పవిత్రాత్మను (11,13)

23). కుంచము (11,33)

24). ఆలకించి, పాటించు (8,21)

25). ప్రియమైన (3,22)

**వచ్చే నెల పాఠ్యాంశం: యోహాను సువార్త 1-10 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com